క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



గణిత ఉపాధ్యాయుడు నాగేంద్ర కుమార్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

నందవరం : మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు నాగేంద్ర కుమార్‌ను ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో నాగేంద్రకుమార్‌ను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పూలమాలలు, శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు.

దేశానికి సేవ చేయాలి



కలీమ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆదోని రూరల్: ఉన్నత చదువులు చదివి దేశానికి సేవ చేయాలని సెకండ్ అడిషనల్ డిస్టిక్ జడ్జి పి.జె.సుధ, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. సీనియర్ న్యాయవాది అబ్దుల్‌రషీద్ కుమారుడు కలీమ్ న్యాయశాస్త్రంలో ఉన్నత చదువులు చదివేందుకు లండన్‌కు వెళ్తున్న సందర్భంగా మంగళవారం ఆదోనిలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. సీనియర్ న్యాయవాదులు మజరుల్ హక్, దేశాయ్, రామిరెడ్డి, మన్సూర్‌అహ్మద్, వై.ఆర్.మల్లికార్జున,గిరి, అనితాబాయి కలీమ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు హాజీ, తబ్రేజ్, నాసీర్, హుసేన్‌సాని, మధు, సల్మాన్, శబాష్‌అహ్మద్, కశ్యప్, రంగన్న పాల్గొన్నారు.

గర్భిణులకు స్కానింగ్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి వచ్చిన 545 మంది గర్భిణులకు మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టరు సుధా తెలిపారు. స్కానింగ్ పరీక్షల్లో గైనకాలజిస్ట్ డాక్టర్లు సుజిత, ఫాతిమా,శైలజలు ఉన్నారు. గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

గర్భిణులు సలహాలు పాటించాలి

పెద్దకడబూరు: గర్భిణులు ఆరోగ్య సలహాలు పాటించి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని డాక్టర్ కేజియా సూచించారు. మంగళవారం పెద్దకడబూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 85 మంది గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓ ఆదినారాయణ, పీహెచ్‌ఎన్ సుశీల, సూపర్‌వైజర్స్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

లద్దె పురుగుపై ఆందోళన వద్దు



చిలకలడోణలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

మంత్రాలయం రూరల్ : పత్తి పంటలో ఆశించిన లద్దె పురుగుపై రైతులు ఆందోళన చెందవద్దని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చిలకలడోణ, మాలపల్లి గ్రామాల్లోని మండల వ్యవసాయ అధికారి జీర గణేష్ ఆధ్వర్యంలో పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ. . పత్తి పంటలో కేవలం లద్దెపురుగులు నాన్ బీటీ మొక్కలను ఆశించి, బీటీ మొక్కలను ఆశించవని తెలిపారు. అలాగే లద్దె పురుగు నివారణకు మందులు పిచికారీ చేయవద్దని వివరించారు. పత్తి పంటలో మెగ్నీషియం లోప నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

వాషింగ్ మిషన్ల పంపిణీ

నందవరం : ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ద్వారా వివిధ కుల వృత్తుల వారికి పనిముట్లను అందిస్తుందని దేశాయ్ నెట్‌వర్క్ అధినేత, బీజేపీ బాధుడు గురురాజ్‌దేశాయ్ అన్నారు. మంగళవారం స్థానిక తపాలా కార్యాలయంలో మహిళలకు విశ్వకర్మ పథకం ద్వారా మంజూరైన వాషింగ్ మిషన్లు పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా వివిధ కుల వృత్తుల లబ్ధిదారులకు రూ.20 వేల వరకు పనిముట్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

పెద్దకడబూరు: పెండింగ్‌లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్, కూలీ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనిముట్లు అందజేయాలన్నారు. గ్రామాలకు కేటాయించి 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు.



ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు



ఎమ్మిగనూరు నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ఆదోనికి బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ

- ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 'అన్నదాత పోరు'
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు

ఆదోని టౌన్/సెంట్రల్/అర్బన్/రూరల్: వైఎస్సార్‌సీపీ రైతన్నలకు బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్సీ డా.మధుసూదన్, ఎమ్మిగనూరు సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదోని సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్కేడీ కాలనీలోని జీరో రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ఆదోని మండలం, పట్టణం, జిల్లా, రాష్ట్రస్థాయి వివిధ హోదాల్లో ఉన్న శ్రేణులతో ఊరేగింపుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, ఆదోని పట్టణాధ్యక్షులు దేవా, చైర్‌పర్సన్ లోకేశ్వరి, మహిళా విభాగం నేతలు శ్రీదేవి, శ్రీలక్ష్మి, జిలేకాబీ, మంజుల, లక్ష్మి, పోలకల్ రేణుక, కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, ఎంపీటీసీ శివన్న, నాయకులు సుధాకర్, నారాయణ, యేసేబు, నాగరాజ్, శేషిరెడ్డి, కోటిరెడ్డి, తిమ్మారెడ్డి, కుంటెప్ప, కుంకనూరు వీరేష్, వై.పి.గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, సలీమా తదితరులు పాల్గొన్నారు.

కదిలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు, రైతుల సమస్యలపై ఆదోనిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమానికి మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి వందలాది మంది పార్టీ శ్రేణులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠల ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు.



అన్నదాతపోరులో పాల్గొన్న నారీమణులు

దశమి ఉత్సవాలకు ఏర్పాట్లు



చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దేవాలయం

గోనెగండ్ల : మండల కేంద్రంలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే శ్రీచింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీఓ మణి మంజరి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ, అధికారులతో కలిసి చింతలాముని, నల్లారెడ్డి స్వామి ఆలయ ముఖద్వారం నుంచి దేవాలయానికి వెళ్లే దారిని పరిశీలించారు. దశమి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య, వీధిలైట్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్ హైమావతి, చంద్రశేఖర్, అనిల్, మలాంగ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి దశమి ఉత్సవాలు

భక్తుల పాలిట కొంగు బంగారంగా పేరొందిన గోనెగండ్ల ఆది చింతలాముని రంగడు, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు ఈ నెల 12వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. 12న శుక్రవారం రాత్రి 2 గంటలకు స్వామివారి పల్లకీ సేవతో ప్రారంభం అవుతుంది. 13న దశమి మహోత్సవం, 14న సాంస్కృతిక కార్యక్రమాలు, 15న పారువేట ఉత్సవం కనుల పండువగా సాగనున్నాయి. 16వ తేదీ మంగళవారం స్వాముల వారి ఆరాధనతో దశమి ఉత్సవాలు ముగిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని సెంట్రల్/రూరల్: ఆదోని నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కె.భార్గవి మంగళవారం తెలిపారు. కార్యకర్త పోస్టు-01, ఆయా పోస్టులు -08 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. కార్యకర్తకు అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆయా పోస్టులకైయితే 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. 01-07-2025 నాటికి 21 నుంచి 35 సంవత్సరములలోపు ఉండినవారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకొనవచ్చునని తెలిపారు. అభ్యర్థి తప్పనిసరిగా వివాహితురాలై ఉండి స్వ గ్రామము, వార్డుకు చెందిన వారై ఉండాలన్నారు. అప్లికేషన్‌తో పాటు జిరాక్స్ కాపీలను జత చేసి ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

- **కోసిగి/మంత్రాలయ రూరల్:** మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ యస్. రాజేశ్వరి దేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 8 ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన వారు మంత్రాలయం సీడీపీఓ కార్యాలయంలో ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.
- **ఎమ్మిగనూరురూరల్:** ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని టౌన్, రూరల్, నందవరం, గోనెగండ్ల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో సఫర్నీసాబేగం పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 17వ తేది సాయంత్రం 5 లోపు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అందచేయాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో మంగళవారం బైకు, లారీ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. విరుపాపురం గ్రామానికి చెందిన రంగన్న, రామాంజినేయులు గ్రామ సమీపంలో బైకుపై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవాలయాల్లో చోరీ

మంత్రాలయంరూరల్: మండల పరిధిలోని వగరూరు గ్రామంలో ఉన్న భీరలింగేశ్వర, వీరనాగప్ప ఆలయాల్లో మంగళవారం చోరి జరిగింది. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెండు దేవాలయాల్లోని హుండీలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని దాదాపు రూ 35 వేల నగదును అపహరించారు. దేవాలయం వెళ్లి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీం అక్కడికి చేరుకుని విచారణ చేపట్టి వేలిముద్రలను సేకరించారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఆదోని అర్బన్: పత్తికొండ పట్టణం మండిగిరి గ్రామ పంచాయతీకి చెందిన నరసన్న(65) పురుగుమందు సేవించి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలు మేరకు వివరాలు.. నరసన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు సేవించాడన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతునికి నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వంపై పోరాటం చేస్తేనే ఆయా సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు అన్నారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయ ఆవరణలో సీఐటీయూ మండల మహాసభ జరిగింది. ఇందులో భాగంగా సీఐటీయూ జెండాను సంఘ మహిళా నాయకురాలు శైలజ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రంగనాయకులు, శివలక్ష్మి, నాగలక్ష్మి, సురేష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడాలి

ఆదోని అర్బన్: మండలంలోని మండిగిరి రైతుల ప్రధాన సమస్యను పరిష్కరించాలని రైతులు ఎమ్మెల్యే పార్థసారథికి విన్నవించారు. ఈ మేరకు ఆయన మంగళవారం జింకవంక స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షపునీరు పంట పొలాల నుంచి జింకవంకలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

ఎమ్మిగనూరుటౌన్: అప్పులు చేసి మరీ పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, చేసిన పనులకు బిల్లులను చెల్లించి మమ్ములను ఆదుకోవాలని కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి పట్టణానికి చెందిన పలువురు కాంట్రాక్టర్లు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దాదాపు 20 మందికి పైగా కాంట్రాక్టర్లు చిన్న, పెద్ద, సిమెంట్, తారు రోడ్లు, డ్రైన్లు, మంచి నీరు సరఫరా చేసే పైప్‌లైన్ల పనులు చేపట్టామన్నారు. 136 పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా వాటికి సంబంధించి తమకు చెల్లించాల్సిన రూ.5.17 కోట్లకు పైగా మంజూరు చేయడం ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు సీతారాంరెడ్డి, తిమ్మారెడ్డి, క్రిష్ణ, రాజేంద్ర, కేఎండీ యుసుఫ్, నాగరాజు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

రైల్వే ప్రయాణికులకు శుభవార్త

- పలు రైళ్లకు ఆదోనిలో స్టాపింగ్

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రాంత ప్రయాణికులకు రైల్వే అధికారులు శుభవార్త తెలిపారు. భాగల్‌కోట–మైసూరు, తిరుపతి– ఔరంగబాద్, లోక్‌మాన్ తిలక్ మద్రాసు రైళ్లు ఆదోని మీదుగా వెళ్తున్నా ఇక్కడ స్టాపింగ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో గుంతకల్లుకు వెళ్లి ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

అయితే పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయా రైళ్లకు ఆదోనిలో స్టాపింగ్‌కు ఉన్నతాధికారులు అనుమతించినట్లు స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

- బాగల్ కోట్ నుంచి మైసూరుకు వెళ్లే బసవ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నెంబర్ 17309) రాత్రి 12.39 గంటల నుంచి 12.40 గంటల వరకు ఆదోనిలో ఆగుతుంది.
- తిరుపతి– ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నెంబర్ 17622) ఉదయం 04.46 నుంచి 04–50 వరకు ఆదోనిలో ఆగుతుంది.
- లోక్‌మాన్ తిలక్ మద్రాస్ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నంబర్ 22179) అర్ధరాత్రి 01–14 నుంచి 01–15 వరకు ఆదోనిలో ఆగుతుంది.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

కోసిగి: పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచుకోవాలని కోసిగి మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ సూచించారు. మంగళవారం కందుకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఉల్లి పంటకు మద్దతు ధర కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో అమ్మకానికి అవసరమయ్యే సర్టిఫికేట్స్ పొందాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు మధుసూధన్ గౌడ్, రాజశేఖర్ , గ్రామస్తులు పాల్గొన్నారు.

- **ఎమ్మిగనూరురూరల్:** రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి మడిరేపల్లి శివశంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడకం వలన భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు నరసింహుడు, వినోద్, వీఏఏలు ప్రియాంక, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతితో పాటు డీఏలను ప్రకటించి పెండింగ్‌లో ఆర్థిక బకాయిలన్నీ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజి. వెంకట్రాముడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంఎస్ బాలికల హైస్కూల్‌తో పాటు జెడ్పీ, వీవర్స్ కాలనీ, ఉర్దూ హైస్కూళ్లలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో వున్న ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి డైట్ అధ్యాపకులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఎంఈఓలుగా తదితర ఉపాధ్యాయ పదోన్నతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, జయానంద్, మనోరంజని, మారుతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలో 167వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు రామ్మోహన్ గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామంలోని ఎంపీపీఎస్ బీసీ పాఠశాలలో రామ్మోహన్ డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. పాఠశాలలో విధులు పూర్తి చేసుకుని ఎమ్మిగనూరుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యలో ముగతి గ్రామ సమీపంలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి బైక్‌పై అదుపు తప్పి కింద పడడంతో తలకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు వైద్య సేవలు అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు టి.వీరేష్, కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని పట్టణంలో తిమ్మారెడ్డి బస్టాండు సర్కిల్‌లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ పేదలకు ప్రజలకు సరైన వైద్యం, విద్యార్థులకు సరైన విద్య అందుతుందనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు, ప్రజలకు అన్యాయం చేస్తూ పీపీపీ పద్ధతిలో కళాశాలలను కొనసాగిస్తామని కేబినేట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, గంగన్న, అంజిత్‌గౌడ్, రామకృష్ణ, ప్రేమ్, రాము, దావీదు, హుసేన్, రాము తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతితో ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం తగదని పీడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ఆదోనికి సమీపంలో 40.44 ఎకరాల భూమిలో మెడికల్ కళాశాలను రూ.475కోట్లతో వంద సీట్లతో అనుబంధంగా 40 పడకల ఆస్పత్రి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకుందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులు పూర్తి చేయక ప్రైవేటీకరించేందుకు క్యాబినేట్‌లో తీర్మానించడం దారుణమన్నారు. నాయకులు ఇమ్రాన్, ఈరన్న, తాయన్న, ప్రతాప్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిని జిల్లాగా ప్రకటించాలి

ఆదోని టౌన్: కర్నూలు జిల్లాకు దామోదర సంజీవయ్య పేరు పెట్టాలని, ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని అభ్యుదయ దళితసేవా సంఘం కార్యదర్శి కల్లుపోతుల రంగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు వినతి పత్రం అందించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికులు ఆకాంక్ష మేరకు ఆదోని జిల్లా సాధనకు తాము ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పీ4 సర్వేపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

నందవరం : పంచాయతీ అధికారులు గ్రామాల్లో పీ4 సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాయంలో పంచాయతీ కార్యదర్శులు, రాజకీయాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలను రాజకీయ నాయకులు, అధికారులు అనుంధానం చేసుకుని వారి జీవన స్థితులు మెరుగు పడేలా తీర్చిదిద్దాలని సూచించారు. మండలంలో నిరుపేద కుటుంబాలు 2,958 ఉన్నాయని, అందులో 2,092 కుటుంబాలు అధికారులు మ్యాపింగ్ చేసుకున్నారని వివరించారు. ప్రస్తుతం 866 కుటుంబాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా త్వరగా మ్యాపింగ్ చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ కృష్ణమూర్తి, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శిథిలమైన రోడ్లను బాగుచేయించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శిథిలమైన రోడ్లను పునర్నిర్మించాలని లేదా మరమ్మతులు చేపట్టాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని కలుగొట్ల రోడ్డుతో పాటు గంజిళ్ల రోడ్డు, గోనెగండ్ల రోడ్డులోని పూల అంగళ్ల నుంచి సున్నం బట్టి వంక వరకు, 7, 14వ వార్డుల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ రోడ్లు శిథిలమయ్యాయన్నారు. అనంతరం వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, కిష్టన్న, నాగరాజు, ఇస్మాయిల్, ఉపేంద్ర, రవి పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం



వర్షాలకు దెబ్బతిన్న పైకప్పు

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు దెబ్బతినడంతో వర్షం పడిందంటే చాలు ఎక్కడ పడితే అక్కడ శ్లాబు నుంచి నీరుకారి పుస్తకాలు తడుస్తూ.. పాఠకులు కూర్చోడానికి కూడా ఇబ్బందులు ఎదురవడం వంటివి సంభవిస్తున్నాయి. అప్పుడప్పుడు శ్లాబు పెచ్చులూడి పాఠకులపై పడుతుండడంతో గ్రంథాలయంలో కూర్చోవడానికే పాఠకులు భయపడుతున్నారు. ఒక్కోసారి ఆరుబయటే పుస్తక పఠనం చేస్తున్నారు. వర్షం పడుతున్న సమయంలో ఎక్కడా కుర్చునే వీల్లేక గ్రంథాలయానికే రావడం మానేస్తారు.

1975లో భవన నిర్మాణం

పెద్దకడబూరు గ్రామంలో గ్రంథాలయ భవనాన్ని 1975లో నిర్మించారు. 50ఏళ్ల వయస్సు దాటిన ఈ భవనం పూర్తిగా శిథిలావ్యస్థకు చేరుకుంది. శ్లాబు దెబ్బతిని పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో పాఠకులు లోపల కూర్చోవడానికి జంకుతున్నారు. నాటినుంచి నేటి వరకు భవనానికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షం పడితే చాలు పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతోంది. దీంతో విలువైన పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. పుస్తకాలను సంరక్షించుకునేందుకు గ్రంథాలయ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాకాలంలో గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేసే వీలు లేకపోవడంతో పాఠకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోన్న నిరుద్యోగులతో పాటు విద్యార్థులు, గ్రామ పెద్దలు గ్రంథాలయ దుస్థితితో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై జిల్లాస్థాయి అధికారులకు పలుమార్లు నివేధికలను పంపినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా సంబంధిత జిల్లాస్థాయి అధికారులు గ్రంథాలయ నూతన భవనాన్ని మంజూరు చేయాలని లేదా పాఠకులు, గ్రామస్తులు కోరుతున్నారు.